క్లుప్తంగా

విద్యార్థులకు దృష్టి లోపంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దొనకొండ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కంటి దృష్టి లోపంపై మార్కాపురం ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల కో ఆర్డినేటర్ ప్రేమకుమార్ శుక్రవారం అవగాహన కల్పించారు. కంటి లోపంతో కలిగే నష్టాలు, ఇబ్బందులు ఆయన వివరించారు. దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మార్కాపురం ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాలలో ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఆపరేషన్లు చేసి కంటి అద్దాలు అందజేస్తామన్నారు. తరగతి గదిలో ఏ విద్యార్థికైనా దృష్టి లోపం ఉంటే గుర్తించి తమ వైద్యశాలకు తీసుకురావాలని ప్రేమసాగర్ సూచించారు. సిబ్బంది కేశవ, అభిషేక్, ఉపాధ్యాయులు హరినాథ్, నరసింహారావు, మురళి పాల్గొన్నారు.

వైద్యుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యశాల సిబ్బంది

తాళ్లూరు: వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని హెచ్ఈఓ చంద్రశేఖర్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని తూర్పుగంగవరం ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జిలతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పీజీ సీట్లలో కోత విధించడంతో 15 రోజులుగా వైద్యులు సమ్మెలో పాల్గొన్నారని, దీంతో ప్రజలకు సరైన వైద్యం అందడం లేదన్నారు. వైద్యుల డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని వెంటనే విధులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


కంది పంటను పరిశీలిస్తున్న ఏఓ

కురిచేడు: మండలంలోని కురిచేడు, వెస్ట్ వీరయపాలెంలో మండల వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ శుక్రవారం వరి, కంది పంటలను పరిశీలించారు. ప్రస్తుతం వరి పైరులో ఎక్కువగా ఆకు ముడతను గమనించామని, గొంగళి పురుగు ఆకు ముడతలో ఉండి పత్ర హరితాన్ని గీకి తినేయడంతో ఆకులు తెల్లబడతాయని తెలిపారు. ఆలస్యంగా నాటిన పొలాల్లో, అధిక యూరియా వాడిన పొలాల్లో పురుగు ఉధృతి పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రవీంద్ర, మేరి, రైతులు పాల్గొన్నారు.

డీలర్లు స్టాక్ రిజిష్టర్లు తప్పకుండా రాయాలి


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

దొనకొండ: ఎరువులు, పురుగుమందులు, విత్తన దుకాణ డీలర్లు తప్పకుండా స్టాక్ రిజిష్టర్లు తప్పకుండా రాయాలని మండల వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో పురుగుమందుల డీలర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి డీలర్ యూరియాను అధిక ధరలకు అమ్మినా, యూరియాకు ఇతర ఎరువులను లింక్ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టాక్ రిజిష్టర్‌లు, స్టాక్ బోర్డులు తప్పకుండా రాయాలని, బిల్లులు రైతులకు ఇవ్వాలని, రైతు సంతకం తప్పకుండా తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఎరువుల దుకాణాలు తనిఖీ చేశారు.

ప్రతి ఆదివారం పాకల బీచ్‌కు ప్రత్యేక బస్సులు

ఒంగోలు మెట్రో: జిల్లాలోని సింగరాయకొండకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న పాకల బీచ్‌కు ఏపీఎస్ఆర్టీసీ ఒంగోలు డిపో నుంచి ప్రతి ఆదివారం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఒంగోలు డిపో మేనేజర్ ఘట్టమనేని శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్ చార్జీ పెద్దలకు రూ.55, పిల్లలకు రూ.30 అని వెల్లడించారు. ఉదయం ఏడు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు, పాకల నుంచి ఒంగోలుకు ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు బస్సులు నడుస్తాయన్నారు. ఆదివారం విహారయాత్రకు వెళ్లాలనుకునే వారు వినియోగించుకోవాలని కోరారు. మహిళలకు ఉచిత ప్రయాణం కూడా వర్తిస్తుందన్నారు.


రామసముద్రం వద్ద ధ్వంసమైన రోడ్డు


గుంతలమయమైన రోడ్డు


ప్రమాదంగా ప్రయాణం

అధ్వానంగా యర్రగొండపాలెం రోడ్డు

- పూర్తిగా గుంతలమయం
- చుట్టూ తిరిగి ప్రయాణం

త్రిపురాంతకం: యర్రగొండపాలెం–త్రిపురాంతకం రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రం యర్రగొండపాలేనికి రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. వాహనదారులకు మరో మార్గం లేక బీఆర్ జంక్షన్ నుంచి వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. త్రిపురాంతకం నుంచి యర్రగొండపాలెం వెళ్లేందుకు 18 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రోడ్డు మార్గం ఉంది. ఈ రోడ్డు పూర్తిగా గుంతలమయమై ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పెద్ద పెద్ద గోతులమయమై రోడ్డు దెబ్బతింది. రోడ్డు మార్జిన్స్ సక్రమంగా లేవు. రోడ్డుపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలి తప్ప లేకుంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే. ఆర్టీసీ బస్సులు తప్ప మిగిలిన ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు ప్రత్యామ్నాయ మార్గం బీఆర్ జంక్షన్ నుంచి ప్రయాణం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ జంక్షన్ నుంచి తిరిగి వెళ్తే సుమారు 40 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. ఏడాదిన్నర నుంచి కూటమి ప్రభుత్వం రోడ్లు వేస్తున్నామని ప్రకటనలు చేస్తున్నా ఆ దిశగా ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు. తప్పని స్థితిలో ఆర్టీసీ బస్సులు మాత్రమే ఈ రోడ్డులో ప్రయాణం చేస్తున్నాయి. ఈ రోడ్డులో ఉన్న చెర్లోపల్లి, మిట్టపాలెం, రామసముద్రం, అయ్యంబొట్లపల్లి, గోళ్లవిడిపి తదితర గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుని అవసరమైన నిధులు వెచ్చించి రోడ్డు నిర్మాణానికి దోహదపడాల్సిన అవసరం ఉంది.


బైకేను బ్యాలెన్స్‌గా నడపాల్సిందే

లయోలా కళాశాల సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
- కళాశాల అభివృద్ధికి రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటన

దర్శి: పేద విద్యార్థులకు ఉన్నత విద్యనందిస్తున్న లయోలా కళాశాల సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక లయోలా కళాశాలను శుక్రవారం పాస్టర్‌ల ఆహ్వానం మేరకు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కళాశాల పాస్టర్‌లు ఘన స్వాగతం పలికారు. పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కళాశాలలో తరగతి గదులు పరిశీలించారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మంచి లక్ష్యంతో లయోలా కళాశాల ఏళ్ల తరబడి ఎంతో మంది పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందిస్తోందన్నారు. ఇటువంటి సంస్థలను సహృదయంతో ఆదుకోవడంలో ఎంతో ఆనందంగా ఉందన్నారు. తన వంతు సహకారంగా కళాశాల అభివృద్ధికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తానని ప్రకటించారు. కళాశాలలో దైవ చింతనతో పాటు మంచి లక్షణాలు విద్యార్థులకు బోధిస్తున్నారని చెప్పారు. మంచి మార్గంలో పయనించే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతారని సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో గోల్‌ను ఎంచుకుని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. పాస్టర్‌లు దైవచింతనతో పాటు విద్యార్థులను మంచి మార్గంలో నడిపించడంలో సఫలమవుతున్నారంటూ వారిని అభినందించారు. కళాశాలకు రానున్న రోజుల్లో తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, వార్డు కౌన్సిలర్ మేడగం మోహన్‌రెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు గర్లెపోగు ఏసుదాసు, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, లయోలా కరస్పాండెంట్ ఫాదర్ బాలశౌరి, ప్రధానోపాధ్యాయుడు ఫాదర్ మైకేల్ రాజు, కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ ఆంథోని పాల్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడం దారుణం


గణపవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

త్రిపురాంతకం: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మండలంలోని గణపవరంలో శుక్రవారం జరిగింది. మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ప్రైవేటు పరం చేయడం సరైన నర్ణయం కాదని వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. ప్రజల అవసరాలు, వైద్య రంగం అభివృద్ధికి, వైద్య విద్యార్థులకు ఆసరాగా గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలలు నిర్మించారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే ప్రైవేటు రంగం నుంచి వైద్య విద్యను, వైద్య కళాశాలలను విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. కాశిరెడ్డి, శరభారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిని పట్టించుకోని ప్రభుత్వం

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

పెద్దదోర్నాల: గ్రామాల అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తోందని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలోని చిలకచర్లలో ఆయన పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో రహదారుల దుస్థితిని ఆయన స్వయంగా పరిశీలించారు. బురదమయంగా మారిన చిలకచర్లలోని పాఠశాల ముందున్న రోడ్డును పరిశీలించారు. అధికారులు స్పందించి పాఠశాల ముందున్న రోడ్డును శుభ్రం చేయకుండా ఉండటాన్ని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి, అల్లురాంభూపాల్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు ఉన్నారు.


రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ


లక్ష్మీనాయక్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి


నాగుల లక్ష్మికి కూడా..

పెద్దదోర్నాల: మండల పరిధిలోని చిలకచర్ల, నందిగూడేల్లో అకాలంగా మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శుక్రవారం పరామర్శించారు. కాట్రావత్ పూలేనాయక్ కుమార్తె అకాల మరణం పొందటంతో ఆయన వారి కుటంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అకాల మరణం పొందిన మాలావత్ లక్ష్మీనాయక్ కుటుంబాన్ని పరామర్శించి ఆయన సతీమణికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం నందిగూడెంలో మృతి చెందిన సర్పంచ్ నాగుల కొండమ్మ మరదలైన నాగుల లక్ష్మి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల మృతి పార్టీకి తీరని లోటన్నారు. వారి కుటుంబాలకు ఎల్లవేళలా పార్టీ అందుబాటులో ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలో కాలు ఫ్రాక్చరై విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త సురేష్‌ను ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శించారు. ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి, అల్లు రాంభూపాల్‌రెడ్డి, గుమ్మా యల్లేష, సింగా ప్రసాద్, చిట్యాల వెంకటేశ్వరరెడ్డి, మొద్దుతిరుపతిరావు, యర్రగొండపాలెం పంచాయతీ సర్పంచ్, త్రిపురాంతకం నాయకులు ఆళ్ల కృష్ణారెడ్డిలో పాటు పలువురు స్థానిక నాయకులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ


మరియదాసును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

తాళ్లూరు: మండలంలోని దారంవారిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యాకర్త జి.మరియదాసు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం రాత్రి ఆయన గృహానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని, ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ మంచాల వెంకటేశ్వరరెడ్డి, గ్రామ నాయకులు దారం రమణారెడ్డి, మారం అంజిరెడ్డి, కాకి తిరుపతయ్య, దార్ల శ్రీను, నూకతోటి పిచ్చయ్య ఉన్నారు.

నిందితులను తక్షణమే శిక్షించాలి


దర్శి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



డీటీకి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కురిచేడు: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కంభంపాటి జోసఫ్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మికి ఎమ్మార్పీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం కంభంపాటి జోసెఫ్ మాదిగ మాట్లాడుతూ భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై రాకేష్ కిషోర్ అనే వ్యక్తి షూ విసిరి దాడికి పాల్పడటం అనాగరికమైందని, ఈ దాడి దళిత పీడిత వర్గాల ప్రజలను మనోవేదనకు గురిచేసిందని, దేశ ప్రజలందరూ దాడిని ఖండిస్తున్నారన్నారు. అనంతరం టౌన్ అధ్యక్షుడు కంభంపాటి ప్రశాంత్ మాదిగ మాట్లాడుతూ ఆధిపత్య శక్తులు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ కావడం జీర్ణించుకోలేక అహంకారంగా దాడికి తెగబడటం దారుణమన్నారు. ఎమ్మార్పీఎస్ టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బరిగిన రుతు బాబుమాదిగ, ఎమ్మెస్ఎఫ్ నాయకులు కంభంపాటి సాయన్న మాదిగ, కంభంపాటి సన్నీ మాదిగ, మాదిగ యువసేన అధ్యక్షుడు వినుకొండ ప్రభాకర్ మాదిగ, గుంజర మార్కు మాదిగ, కోట జాన్‌వెస్లీ పాల్గొన్నారు.

దర్శి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి యోగేశ్వరరావు డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యోగేశ్వరరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి జరిగి పది రోజులు కావస్తున్న నిందితుడిపై చర్య తీసుకోక పోవడం దారుణమన్నారు. న్యాయమూర్తికే రక్షణ లేకపోతే సాధారణ ప్రజలకు ఎలాంటి రక్షణ కల్పిస్తారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కవలకుంట్ల గోవింద ప్రసాద్ మాదిగ, గర్నెపూడి ప్రేమ్‌కుమార్, రాచపూడి మోషే, రాచపూడి సునీల్, సంజు పాల్గొన్నారు.

అమ్మనబ్రోలు, ఉప్పుగుండూరులో అవగాహన కార్యక్రమం

నాగులుప్పలపాడు: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందస్తు అనుమతులు లేకుండా ఎవ్వరూ దీపావళి మందులు అమ్మరాదని నాగులుప్పలపాడు ఎస్సై రజియా సుల్తానా స్పష్టం చేశారు. మండలంలోని అమ్మనబ్రోలు, ఉప్పుగుండూరు గ్రామాల్లో దీపావళి మందులు విక్రయిస్తున్న షాపుల నిర్వాహకులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. క్రాకర్స్ అమ్మకాల కోసం తీసుకోవాల్సిన అనుమతులతో పాటు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.


వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్సై రజియా సుల్తానా

లైసెన్సులు లేకుండా బాణసంచా అమ్మరాదు

మద్దిపాడు: లైసెన్సులు లేకుండా మండలంలోని గ్రామాల్లో బాణసంచా అమ్మరాదని ఎస్ఐ వెంకట సూర్య స్పష్టం చేశారు. లైసెన్సులు లేకుండా బాణసంచా అమ్మే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎవరైనా తాత్కాలికంగా అమ్మాలనుకుంటే సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని శుక్రవారం ప్రకటన విడుదల చేశారు.

పేకాట శిబిరంపై దాడి

నాగులుప్పలపాడు: పేకాటాడుతున్న వ్యక్తులపై దాడి చేసి వారి వద్ద నుంచి నగదు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు నాగులుప్పలపాడు ఎస్సై రజియా సుల్తానా తెలిపారు. మండలంలోని తిమ్మసముద్రం గ్రామ సమీప పొలాల్లో పేకాటాడుతున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు చెప్పారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,100 నగదు, రెండు సెల్‌ఫోన్లు, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెల్లడించారు. ఈ దాడిలో ఏఎస్సై సుబ్బారావు, కానిస్టేబుళ్లు హరికృష్ణ, రెహమాన్, నారాయణ, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కల పంపిణీ

సంతనూతలపాడు: పర్యావరణ పరిరక్షణకు మొక్కల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సంతనూతలపాడు మండలం గుమ్మలంపాడు గ్రామంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు ఎంపీడీవో డి.సురేష్ బాబు మొక్కలు పంపిణీ చేశారు. ప్రతి మూడో శనివారం స్వానిటేషన్ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయశంకర్, బొడ్డపాటి చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 118 మందికి ఉద్యోగాలు

సంతనూతలపాడు: మండలంలోని ఎండ్లూరు డొంక వద్ద గల మహిళా ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి మెగా జాబ్‌మేళాలో 118 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె.రవితేజ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మెగా జాబ్ మేళాకు మొత్తం 252 మంది హాజరవగా, పది కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు రవితేజతో పాటు ఏపీఎస్సీ ప్రతినిధి శ్రీను నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఆఫీసర్ శ్రీనివాసాచారి, ఏపీఎస్సీ ప్రతినిధి సాయి ప్రణీత, ఎన్టీఓ కో ఆర్డినేటర్లు ఎస్కే బాషా, అనూష, అబ్దుల్ రెహ్మాన్, మహిళా ప్రాంగణ ప్రతినిధి శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.